క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ నర్సయ్య బుధవారం భూమిపూజ చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు పరిశోధన కేంద్రం సందర్శన



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రాన్ని మహారాష్ట్రలోని హింగోళి జిల్లా రైతులు బుధవారం సందర్శించారు. పరిశోధన స్థానంలోని పరిశోధన అంశాలు, నూతన వంగడాలు, అభివృద్ధి, వ్యవసాయ పనిముట్ల గురించి శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. పసుపు రకాల్లో కుర్కుమిన్ శాతం, మార్కెట్, డిమాండ్, దిగుబడి, వ్యయం, సేంద్రీయ సాగు, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

చంద్రబోస్ వర్ధంతిని జయప్రదం చేయండి



ఆర్మూర్: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సిద్ధాంతకర్త రాయల సుభాష్ చంద్రబోస్ తొమ్మిదో వర్ధంతిని జయప్రదంద చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం పిలుపునిచ్చారు. ఈమేరకు పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో బుధవారం మాస్‌లైన్ నాయకులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న ఖమ్మంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సభకు భారీగా సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్, సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్, నాయకులు సత్తెక్క, టి.గంగాధర్, యు.రాజన్న జి. పద్మ, ప్రజా సంఘాల నాయకులు రవి, నిఖిల్, సిద్దు, నవదీప్, సాయిరాజ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు పంట పొలాల పరిశీలన



బోధన్: నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు ప్రాంతం జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులోని సాగు చేసిన పంట పొలాలకు నీటి సరఫరా పరిస్థితిని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ మండల అధికారులు బుధవారం పరిశీలించారు. చివరి ఆయకట్టు పంటలకు నీరందించేందుకు పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. బోధన్, సాలూర మండలాల ఏవోలు ఎండీ అలీం, శ్వేత, ఇరిగేషన్ శాఖ ఏఈ శృతి, ఏఈవో ఉమా స్థానిక రైతులతో మాట్లాడారు. వరి, మొక్కజొన్న పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయని, ఎండిపోకుండా నీళ్లందించాలని రైతులు అధికారులను కోరారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



బోధన్: ప్రతి విద్యార్థి సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవా లని సాలూర ఎంఈవో రాజీ మంజూష అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.ఈసందర్భంగా విద్యార్థుల సైన్స్ సంబంధిత ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మిద్దెల రాజు, కరస్పాండెంట్ లతారాజు, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ, ప్రతినిధి రమణారెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

రుద్రూర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మెరుగైన విద్యుత్ సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పొతంగల్ మండల ఏఈ ఫక్రుద్దీన్ ఖాద్రీ అన్నారు. బుధవారం పొతంగల్‌లో 100 కేవీఏ, హంగర్గ ఫారంలో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఇంటింటికి తిరిగి పన్ను వసూలు

- పన్నులు చెల్లించని వారి ఇంటి ముందు బైఠాయింపు
- పట్టణాభివృద్ధికి సహకరించాలని అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది
- మిగిలింది 25 రోజులే



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో 36 వార్డులలో ఇంటింటికి తిరిగి సిబ్బంది పన్ను వసూలు చేస్తున్నారు.అలాగే మొండి బకాయిదారుల ఇంటి ముందుట మున్సిపల్ అధికారులు బైఠాయించి ఆస్తిపన్నులు చెల్లించే విధంగా చేస్తున్నారు. ఇప్పటికీ 60% వసూలు కాగా, మిగతా 40% వసూలు చేయడానికి ఇంకా 25 రోజులు మాత్రమే ఉన్నాయి. 81% పన్ను వసూల లక్ష్యాన్ని సాధిస్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరై పట్టణ అభివృద్ధికి దోహదపడుతాయి. ప్రజలు ఆస్తిపన్నులు చెల్లించడం ద్వారా మున్సిపల్‌లో వివిధ అభివృద్ధి పనులు జరుగుతాయి. మున్సిపల్ కార్మికులకు వేతనాలు, శానిటేషన్‌కు సంబంధించి వాహనాల మెయింటెన్స్‌కు, చెత్త సేకరణ, డ్రెయినేజీ మరమ్మతులు, రోడ్ల అభివృద్ధికి నిధులు ఉపయోగపడుతాయి.

సకాలంలో పన్నులు చెల్లించండి

ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలి. అధికారులు ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రజలు అధికారులకు సహకరించి పన్నులు చెల్లించాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్

మొత్తం అసెస్మెంట్లు	19,863
పన్నుల మొత్తం డిమాండ్	రూ.6.50 కోట్లు
ఇప్పటి వరకు వసూలైంది	రూ.3.90 కోట్లు
ఇంకా వసూలు చేయాల్సింది	రూ.2.60 కోట్లు

పాత బకాయిలు
రూ.1.64 కోట్లు, అందులో రూ. 31 లక్షలు వసూలయ్యాయి.

పాఠకులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి
- రుద్రూర్, కోటగిరి, రాయకూర్ గ్రంథాలయాల సందర్శన



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

రుద్రూర్: గ్రంథాలయాల్లో పాఠకులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. రుద్రూర్, కోటగిరి, రాయకూర్ గ్రామీణ గ్రంథాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు.రుద్రూర్ గ్రంథాలయంలో కూలర్ ఏర్పాటు చేస్తామన్నారు. రాయకూర్‌లో గ్రామీణ గ్రంథాలయ పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈమేరకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

నిరుద్యోగుల కోసం పైఅంతస్తు కేటాయించాలి

రుద్రూర్ మండల కేంద్రంలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న నిరుద్యోగులు చాలా మంది ఉన్నారని, వారు చదువుకోవడం కోసం గ్రంథాలయ పైఅంతస్తును కేటాయించాలని స్థానికులు చైర్మన్‌ను కోరారు. ఉచితంగా చదువుకోవడానికి ఉన్న ప్రేరణ స్టడీ సెంటర్ గదులు శిథిలావస్థకు చేరడంతో అందులోకి వెళ్లడానికి బయపడుతున్నారని తెలిపారు. ఈమేరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విండో డైరక్టర్ కర్క అశోక్, మాజీ వార్డు సభ్యుడు నిస్సార్, ఇందూర్ కార్తీక్, పోతరాజు లింగం, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి వోముల సాయన్న యాదవ్, లైబ్రేరియన్ శ్రీనివాస్, శివరాజు తదితరులున్నారు.

సౌకర్యాలను మెరుగుపర్చాం

వర్ని: గ్రంథాలయాల్లో పుస్తకాలతో పాటు అన్ని రకాల సౌకర్యాలను మెరుగుపర్చినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి వెల్లడించారు. బుధవారం మోస్రా, వర్ని గ్రంథాలయాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇప్పటికే అన్ని సౌకర్యాలను మెరుగుపరిచామని ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్ది సౌకర్యాలను కల్పిస్తామన్నారు. పాఠకులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి వస్తే వాటిని పరిష్కరిస్తానని వెల్లడించారు.

తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



బోధన్‌లో ఓ పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఆర్మూర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద..

రుద్రూర్: కోటగిరి జూనియర్ కళాశాల, రుద్రూర్ అంబం (ఆర్) మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. కోటగిరిలో 217 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 12 మంది గైర్హాజరయ్యారు. మోడల్ కళాశాలలో 83 మందికి గాను 76 మంది, వొకేషనల్ కోర్సులో 43 మందికి గాను 40 మంది పరీక్షలు రాశారు. తొలి పరీక్షకు పది మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ సతీష్ తెలిపారు.

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు సజావుగా కొనసాగాయి. 2,395 మంది విద్యార్థులకు 2,275 మంది పరీక్ష రాశారు. 120 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఒక గంట ముందే చేరుకున్నారు.

చర్చిల ఆస్తులను కాపాడడమే లక్ష్యం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సీఎస్ఐ చర్చి ట్రస్టుకు సంబంధించిన భూములను అమ్మడానికి గాను లీజుకు ఇవ్వడానికి గాను ఎవరికి హక్కు లేదని కరీంనగర్ చర్చి వైస్ ప్రెసిడెంట్ గుండ్రి కృపానందం అన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్‌లో ఇప్పటికే సీఎస్ఐ చర్చికి సంబంధించిన 63 ఎకరాల స్థలంలో కేవలం 6 ఎకరాల భూమి మిగిలి ఉందన్నారు. చర్చిల ఆస్తులను కాపాడడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. సీఎస్ఐ చర్చి భూముల అన్యాక్రాంతంపై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీహనుమంత్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సీఎస్ఐ చర్చి ప్రెసిడెంట్ రవిచంద్రన్, అనిల్ కుమార్, రేపల్లి బాబీ ప్రసాద్, డేవిడ్ రాజ్, పాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల్లోనే బాల్యం

- పట్టించుకోని అధికారులు



జలాల్‌పూర్ శివారులో ట్రాక్టర్‌లో ఇటుకలు లోడ్ చేస్తున్న బాలకార్మికులు

బాల్కొండ: బాల్కొండ మండలం జలాల్‌పూర్, బస్సాపూర్ శివారుల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల్లో ఏపీ నుంచి వచ్చిన కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో బాల కార్మికులు ఇటుక తయారీ పనుల నుంచి ఇటుకను లోడ్ చేసి తరలించే పనులు చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం జలాల్‌పూర్ శివారులోని ఓ ఇటుక బట్టీ యజమానికి అధికారులు నోటీసులు ఇచ్చి వదిలేశారు. ఇటుక బట్టీల యాజమానుల నుంచి అధికారులు మామూళ్లు తీసుకొని పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. గతంలో ఇటుక బట్టీల వద్ద ప్రత్యామ్నాయ పాఠశాలలను ఏర్పాటు చేసి, సమీప పాఠశాల నుంచి మధ్యాహ్న భోజనం సరాఫరా చేసే వారు ఇప్పుడు అటువంటివి ఏమి చేయడం లేదు. ఇటుక బట్టీల యజమానులే షెడ్లు నిర్మించాల్సి ఇవ్వాల్సి ఉంటుంది. చిన్నారులకు కావాల్సిన సామగ్రిని సమకూర్చాలి. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించాలి.

చర్యలు తీసుకుంటాం

ఇటుక బట్టీల్లో బాలకార్మికులను పనిలో పెట్టుకుంటున్న యజమానులపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఒక బట్టీ యజమానికి నోటీసులు ఇచ్చాం. ప్రత్యామ్నాయ పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

- కోటగిరి తహసీల్దార్ గంగాధర్



మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాధర్

రుద్రూర్: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్ సూచించారు. బుధవారం నిర్వహించిన పోతంగల్ హైస్కూల్ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమానికి తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా ఏకాగ్రతతో చదువుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో లోల శంకర్, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ సాయిలు, విండో మాజీ చైర్మన్ శాంతిశ్వర్ పటేల్, మాజీ సర్పంచ్‌లు వర్ని శంకర్, కాశాగౌడ్, వహీద్, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, నాగనాథ్, నాయకులు శ్రీరాం, ప్రశాంత్ కిరణ్ బాబు, రామరావ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మికం

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం



బోధన్: పట్టణ కేంద్రంలోని బీటీనగర్ కాలనీలో కొలువైన శ్రీకోట మైసమ్మ సహిత లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు కొనసాగాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారి రథోత్సవాన్ని ఆలయ వ్యవస్థాపకులు పసుపులేటి గోపికిషన్, మల్లారం గుట్ట ఆశ్రమ స్వామి పిట్ల కృష్ణ మహరాజ్ ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమై పట్టణ ప్రధాన వీధుల మీదుగా రథయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో ఏకచక్రేశ్వరాలయం, మారుతి మందిరం అభివృద్ధి కమిటీల చైర్మన్‌లు హరికాంత్, గుండేటి శంకర్, ప్రవీణ్ మహరాజ్, భక్తులు కిషోర్, సుధాకర్, కృష్ణ, భీంరావు, పరమేష్, విజయ్, గోవింద్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వేల్పూర్: కుకునూర్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి పసుపు బాలాజీ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పెర్కిట్(ఆర్మూర్)/రుద్రూర్ : పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు కోకిల సేవా సంస్థ వ్యవస్థాపకుడు నాగరాజు పరీక్ష సామగ్రిని అందజేశారు. పొతంగల్ జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు.

మొరాయిస్తున్న ఎల్ఆర్ఎస్ సర్వర్

- ముందుకు సాగని ప్రక్రియ



ఎల్ఆర్ఎస్ సర్వర్ రావడం లేదని దరఖాస్తుదారుడికి చెబుతున్న అధికారి

ఆర్మూర్‌టౌన్: ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించేందుకు ప్రజలు మున్సిపల్ కార్యాలయాలకు వెళ్తున్నారు. మూడు రోజుల నుంచి ఆర్మూర్‌లో సర్వర్ సమస్య ఉండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై 25% రిబేట్ ప్రకటించింది. ఈఅవకాశం మార్చి 31 వరకే ఉంది. దీంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న ప్రజలు కార్యాలయాలనికి చక్కర్లు కొట్టే పరిస్థితి వచ్చింది. సర్వర్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ

బోధన్‌టౌన్(బోధన్): మున్సిపాలిటీ పరిధిలో ని అనధికార లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 28 విడుదల చేసిందని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన చేశారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఈనెల 31లోగా ఫీజు చెల్లించిన వారికి 25శాతం రాయితీ లభిస్తుందన్నారు. బల్దియా కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత అధికారి జి. వెంకటేష్ సెల్ నంబర్ 6301707191 ను సంప్రదించాలని కోరారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



కమ్మర్‌పల్లి : సమాజంలో బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎస్.కె రసూల్‌బీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోనసముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రసూల్‌బీ మాట్లాడుతూ, బాలికలు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, లింగ వివక్ష, లింగ నిర్ధారణ పరీక్షలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ తదితర అంశాలపై సీడీపీవో స్వర్ణలత వివరించారు. బాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ గంగ హంస, డీహెచ్ఈడబ్ల్యూ సౌమ్య, ఐసీపీఎస్ చైతన్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

రుద్రూర్: విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి పోతంగల్ మండల నాయకుడు మర్కెలి ప్రకాష్ పటేల్ నగదు బహుమతి ప్రకటించారు. పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ బహుమతులు రూ. ఐదు, మూడు వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.15, శబ్దం (తెలుగు) - 1.35, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) -4.40, అగత్యా(తెలుగు)-7.50, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	శబ్దం(తెలుగు)-10.05, ఛావా (హిందీ) -1.10, 7.35, 10.55, మజాకా (తెలుగు) -4.30
స్క్రీన్-3-	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.10, మజాకా(తెలుగు)-1.20, గ్యాంగ్స్ ఆఫ్ వేస్ పూర్(హిందీ)-4.25, శబ్దం(తెలుగు)-7.40, 10.45
స్క్రీన్-4	నేనెక్కడున్నా(తెలుగు)-10.45, గార్డ్(తెలుగు)-1.25, ఛావా(హిందీ)-4.00, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20, మజాకా(తెలుగు)-10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00, 4.40, 7.30, 10.20, అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40, మజాకా (తెలుగు) - 1.45, 7.35, 10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30, శబ్దం (తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05, మజాకా (తెలుగు) - 1.25, టర్న్ ఆఫ్‌ది డ్రాగన్ (తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	సంటీప్‌కిషన్ మజాకా(తెలుగు)- 10.00, 4.15, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)- 1.05, ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40, ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు) - 4.10, 10.20, మజాకా(తెలుగు) - 7.15
స్క్రీన్ -4	ఓయ్(తెలుగు)-10.05, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30, ఛావా(హిందీ)-4.20, సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40, మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్
దేవి	మజాకా
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	130
		లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900		

– నిజామాబాద్ బిజినెస్

ఎన్డీఎస్ఎల్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి



ఎన్డీఎస్ఎల్ ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

బోధన్ : నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్) లేఆఫ్‌నాటి నుంచి కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికుల సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఫ్యాక్టరీ ప్రధాన గేట్ వద్ద వారు మాట్లాడారు. గురువారం జరుగబోయే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో బకాయి వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిచో అసెంబ్లీ సమావేశాల్లో హైదరాబాద్‌కు వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరిస్తామని నాయకులు వెల్లడించారు. 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీని ప్రైవేట్ యాజమాన్యం అక్రమంగా లేఆఫ్ ప్రకటించిందన్నారు. దీంతో వందలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీని పునః ప్రారంభించి కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చి 15 నెలలైనా నెరవేర్చలేదన్నారు. నాయకులు రవి శంకర్‌గౌడ్, ఉపేందర్, బాలకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, భాస్కర్ తదితరులున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలి



బోధన్: విద్యుత్ ప్రమాదాలబారిన పడకుండా పొలాల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని నిజామాబాద్ డీఈ (టెక్నికల్) రమేష్ అన్నారు. బుధవారం సాలూర మండలంలోని హున్సా గ్రామ శివారులో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా విషయంలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.విద్యుత్ మెటార్లు, స్టార్టర్లు, పీవీసీ పైప్‌లు ఐఎస్ఐ నాణ్యతతో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ నగేష్‌కుమార్, ఏఈలు కళ్యాణ్, బాలకిషన్, లైన్ ఇన్ స్పెక్టర్ సునంద్, లైన్ మెన్‌లు, రైతులు పాల్గొన్నారు.

జిజ్ఞాస పోటీలకు ప్రాజెక్టుల ఎంపిక



ఆర్మూర్‌టౌన్: రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల పరిశోధన ప్రాజెక్టులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వేణుప్రసాద్ తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు తమ కళాశాలకు చెందిన వాణిజ్య, భౌతిక శాస్త్ర విభాగాల పరిశోధన ప్రాజెక్టులు అర్హత సాధించాయన్నారు. రెండు విభాగాల నుంచి ప్రాజెక్టులు ఎంపికవ్వడంపై హర్షం వ్యక్తంచేశారు. వాణిజ్య, భౌతిక శాస్త్ర విభాగాల గైడ్‌లు లింగన్న, వజీరాభానుతోపాటు విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.